పనుల్లో జాప్యం.. ప్రజలకు శాపం



- పురోగతి లేని నాదర్‌గుల్ రోడ్డు పనులు
- సాకులు చెబుతూ కాలం వెల్లదీస్తున్న కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

తుర్కయంజాల్: సాగర్ రహదారి నుంచి తుర్కయంజాల్ గ్రామం మీదుగా నాదర్‌గుల్ వరకు చేపడుతున్న పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డును విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే న్యాయ పరమైన ఇబ్బందుల కారణంగా కొన్నేళ్ల పాటు విస్తరణ, మరమ్మతుల పనులు నిలిచిపోయాయి. అన్ని అడ్డంకులను అధిగమించి నాలుగు నెలల క్రితం పనులను ప్రారంభించారు. దీంతో ప్రయాణం సాఫీగా సాగుతుందని అందరూ ఆశపడ్డారు. కానీ పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డును రెండు వైపుల తవ్వి రెడీమిక్స్ పోసి వదిలేయడంతో దుమ్ము, ధూళి వ్యాపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలతో పాటు, దుకాణదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

రోడ్డు పనులను చేపడుతున్న కేఎస్‌ఆర్ సంస్థ ప్రతినిధులను 'సాక్షి' పలుమార్లు పెండింగ్ పనులపై ఆరా తీసింది. ప్రతిసారి ఏవో కారణాలు చెబుతూ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. మొదట్లో ఓ కౌన్సిలర్ భర్త పైప్‌లైన్, డ్రైనేజీ లైన్లను మార్చి పనులను చేపట్టాలని కోరడంతో కొన్ని రోజుల పాటు వాయిదా వేశామని చెప్పారు. ఆ తరువాత డాంబర్ దొరకడం లేదని, మరోసారి బిల్లులు రావడం లేదని చెప్పడం గమనార్హం.

త్వరలో మోక్షం



కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించాం. వెంటనే పనులు చేపట్టాలని కోరాను. త్వరలోనే ఈ రోడ్డుకు మోక్షం కలుగనుంది. ప్రజలు అప్పటి వరకు సహకరించాలని కోరతున్నాను.

– మల్‌రెడ్డి అనురాధ, మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను శనివారం హైదరాబాద్‌లో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసురెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, రాజేందర్ రెడ్డి, యాదయ్య, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ పడిపూజ



హనుమాన్ మహాపడిపూజలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రబిక్యతాండాలో హనుమంతు స్వామి నివాసంలో శనివారం హనుమాన్ మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాపడిని పూలు, పండ్లతో అలంకరించారు. అనంతరం గురుస్వాములు సంగ్రియా, చంద్రు, రమేశ్, గణేశ్, కిషన్ ఆధ్వర్యంలో హనుమాన్ మహాపడిపూజ నిర్వహించారు. పూజ అనంతరం హనుమాన్ మాలాధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ పాల్గొని పూజలు చేశారు. మహాపడిపూజలో స్థానికులు వెంకటేశ్, శ్రీకాంత్, బోజ్యా, నేనావత్ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డులోని మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి కాలనీలో మహాత్మా జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, మండల పార్టీ కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను ప్రజలకు తెలిజేసేందుకే విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్, శేఖర్, పుల్లయ్య, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఏర్పాటుకు విజ్ఞప్తి

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన బాకీ జాన్

తుక్కుగూడ: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన దామోదర రాజనర్సింహను తుక్కుగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాకీ జాన్ శనివారం నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని బాకీ జాన్ విజ్ఞప్తి చేశారు. వైద్య పరంగా మరిన్ని మెరుగైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి



సదస్సుకు హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఈ– రైడ్, ఈ–మొబిలిటీ సీఈఓ దేవేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో శనివారం తల్లిదండ్రులు, విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని, వాటి ఆధారంగా స్టార్టప్ మొదలుపెట్టి ఇతరులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ వెహికల్స్ రంగానికి మంచి భవిష్యత్తు ఉంటుందని వెల్లడించారు. టాలెంట్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఇమాన్యుయేల్ మాట్లాడుతూ విద్యార్థులు మానవ మేథస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి, ఎండీ హెచ్‌ఎస్ సైనీ, జీఎన్ఐటీ ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, వినయ్ చోప్రా, రిషి సియాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటమితో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కుంగిపోవద్దని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, చంద్రశేఖర్‌రెడ్డి, సతీశ్, గుత్తి బాలస్వామి, సైదులు, ప్రసాద్, కిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహాపడి పూజకు హాజరు

మాడ్గుల: మాడ్గుల మండలం కొలుకులపల్లి గ్రామంలో వెంకటేశ్‌స్వామి నివాసంలో శనివారం అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనతో గ్రామం మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిని వెంకటేశ్ స్వామిని ఘనంగా సత్కరించారు. పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులు బట్టు ధర్మారెడ్డి, భూపతి రెడ్డి, శివ, జంగయ్య, పాండు, పెద్దిరాజు, చంద్రమౌళి, చంద్రశేఖర్ రెడ్డి, గురువయ్య, రాజశేఖర్, సతీశ్, యాదయ్య, పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కసిరెడ్డి పూజలు



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కసిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలోనే కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నారాయణరెడ్డిని ఆశీర్వదించారు. పూజా కార్యక్రమాల్లో మాడ్గుల జెడ్పీటీసీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కొల్కులపల్లి సర్పంచ్ అనురాధ, ఖానాపూర్ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యను అభ్యసించే విద్యార్థులు, ఉపాధ్యాయులుగా మారారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో చక్కటి ప్రతిభ కనబరిచి అభినందనలు అందుకున్నారు. ఉపాధ్యాయుల వేషధారణలో ఉన్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్, ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన

కందుకూరు: బాలల పరిరక్షణ బాధ్యత అందరిపైన ఉందని రాచులూరు సర్పంచ్ పి.శ్రీనివాస్‌చారి సూచించారు. శనివారం మండల పరిధిలోని రాచులూరు ప్రభుత్వ పాఠశాలలో హ్యూమన్ రైట్స్ జిల్లా నిర్వాహకుడు కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. బాలలపై వేధింపులు, అకృత్యాలు, హింస జరగకుండా చూడాలన్నారు. బాలలకు ఎదురయ్యే సమస్యలు గుర్తించి పరిష్కరించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శివకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ యాదయ్య, శోభ, ఆశా కార్యకర్తలు సంతోష, సరిత, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, యాదమ్మ, గ్రామస్తులు యాదయ్య, నరేష్, లక్ష్మణ్, హైమావతి, ప్రమీల, అండాలు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం స్వామివారికి అభిషేకం, తులసీదళ అర్చన, తిరుప్పావై ప్రబంధ విన్నపం, నక్షత్రహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం (నేడు) నుంచి జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప సర్పంచ్ తిరుపతి శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

20న సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: ఈ నెల 20న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శనివారం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేవంత్‌రెడ్డి ప్రకటన హర్షణీయం

మంచాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం హర్షనీయమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. శనివారం మంచాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని త్వరలో అమలు చేసి ఉద్యోగులకు అండగా నిలువాలని కోరారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23న ప్రారంభమై.. 28వ తేదీన ముగుస్తాయని ఆలయ సిబ్బంది తెలిపారు. స్థానిక సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బందితో కలిసి శనివారం బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఇబ్రహీంపట్నం: ఆటో డ్రైవర్లు, ఓనర్లను ఆదుకోవాలని ఆటో జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి.. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఆటోడ్రైవర్లు, ఓనర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. 25 పైసల వడ్డీకి రుణాలివ్వాలని, నెలకు రూ.12 వేలు ఆర్థిక సాయంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జంగయ్య, రామచంద్ర, అశోక్, రాములు, భాస్కర్, కిషన్, శ్రీనివాస్, కృష్ణ, యాదయ్య, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మానవ మనుగడ



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం ఏవీఆర్ శాస్త్రి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యతోనే మనిషి మనుగడ సాధ్యమవుతుందని పేద విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కప్పపహాడ్ సర్పంచ్ సామల హంసమ్మ కోరారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కప్పపహాడ్ గ్రామంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు పుష్పలత.. సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఎస్ఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ పారిజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న పుష్పలత

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

యాచారం: పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, వారి ఉన్నత చదువులకు ఎంతో దోహద పడుతుందని నందివనపర్తి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏవీఆర్ శాస్త్రి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో తలిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్, ఉపాధ్యాయులు రమావత్ కిషన్, వెంకట్‌రెడ్డి, భోజయ్య, మల్లీశ్వరి, శ్రీలత, పద్మావతి, సుధారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.